# నివురు



## కాకాని చక్రపాణి కథలు

# నివురు

**కాకాని చక్రపాణి కథలు**

Media House

Publications
2003

**NIVURU**
(A Collection of Short Stories)

By-
**Dr. Kakani Chakrapani**

© *Reserved*

First Published: June, 2003

*Title* : Mohan

*Typesetting* : Raghu Ramaiah

*Printed at* : Akruthi Offset Printers
&: 040-2766 4525

*For Copies:*

l **Media House Publications**
1-9-289/4, Behind Post Office
Vidyanagar, Hyderabad - 500 044.
&: 040-2760 7307.

l **Visaalaandhra Book House**
and all other leading Book Shops

Price: **Rs. 60/-**

# అన్నయ్యా...



శ్రీ కాకాని రామకృష్ణారావుకు
ప్రేమతో అంకితం

**-నీ చిన్నా**

## మా అన్నయ్యకు....

కనిపించేదాన్నుండి కనిపించని దానికి పయనించటమే బతుకు. ఆ ప్రయాణంలో ప్రేమను పంచే వాళ్ళు కొద్దిమందే. అప్పటికి నాకు ప్రేమించటం తెలీదు. ఏదయినా పెద్ద వాళ్ళ నుంచే నేర్చుకుంటాం. మొదటగా మా అమ్మ, బామ్మ, అన్నయ్య ఆ తర్వాత ఎందరో –

మా ఊరు ఓ చిన్న పల్లెటూరు – చినకాకాని. విజయవాడ– గుంటూరుల మీదుగా వెళ్ళే గ్రాండ్‌ట్రంక్ రోడ్డులో మంగళగిరికి 3–4 మైళ్ళ దూరంలో ఉందా ఊరు. మెయిన్ రోడ్డు నుంచి అరమైలు లోపలికి చెరువుకట్ట వెంబడి వెళ్తేగానీ మా ఊరురాదు. ఊరి మొగదల్లో ఊడలు దిగిన పెద్ద మర్రిచెట్టు. ఆ చెట్టుకు ఎగువన చెరువు కట్టకు ఆనుకుని కట్టిన శివాలయం, కేశవాలయం. చెట్టు నుంచి సీదావెళ్తే ఫర్లాంగు దూరంలో మా ఇల్లు– బేతంచర్ల నల్లబండలు పరచిన ఇల్లు. సింహద్వారానికి అటుపక్క ఇటు పక్కా పొడుగాటి అరుగులు. ఆ ఇంట్లో మా ముత్తాత, తాత, నాయన పుట్టారు, పెరిగారు, గిట్టారు. ఆ ఇంట్లోనే సుమారుగా పదిహేనేళ్ళునాకంటే ముందు పుట్టాడు మా పెద్దన్నయ్య (25.9.1927న). ముందు పుట్టాడుకనుక మానాయన పోగానే కుటుంబ భారం ఆయన మీదపడింది. నేనే కనక ముందు పుట్టివుంటే ఆయనంత బాగా కుటుంబ బాధ్యతలను నిర్వహించగలిగి ఉండేవాడ్ని కాదేమో! యజమాని పోయాక ఇల్లు కష్టాలకు నిలయమవుతుంది. ఆ కష్టాలు నాకు తెలీదు. మా అన్నయ్య ఏం బాధలు పడ్డాడో తెలుసుకోగల వయసు కాదు నాది.

మా అన్నయ్య జీవితాన్ని గాఢంగా, ఉధృతంగా సంభావించే మనిషి. ఎన్నో అనుభవాలు, అన్నీ చెప్పలేం. నా పదేళ్ళ వయసులో మంగళగిరి హైస్కూలులో ఐదో క్లాసులో చేరాను. మా ఊరినుంచి నడిచి వెళ్ళటం, తిరిగి రావటం. రోజుకు 6–7 మైళ్ళ నడక. మా అన్నయ్య ఐఎల్‌టిడి కంపెనీలో పనిచేసేవాడు. మంగళగిరికి మైలున్నర దూరంలో ఉండేది ఆయన కంపెనీ. సైకిలు మీద వెళ్ళివచ్చే వాడు. నేనూ, మా చిన్నన్నా స్కూలు వదిలాక సాయంత్రం ఇంటికి తిరిగి వస్తూంటే, మా పెద్దన్నయ్య కంపెనీనుంచి తిరిగివస్తూ – చిన్నవాడిని కనుక నన్ను ఎక్కించుకుని తీసుకువచ్చేవాడు. అదెప్పుడో ఓసారి జరిగేమాట. అన్ని మైళ్ళు సైకిల్ తొక్కాల్సి రావడంవల్ల ఆయాసం వస్తూండేది ఆయనకు. ఆయన వదిలే వెచ్చటి గాలి సైకిల్ బార్‌మీద కూర్చున్న నాకనుభూతమయ్యేది– ప్రేమగా, చల్లగా. ఆయన కోపం కూడా ఉధృతంగా ఉండేది. భోజనాలు చేసేటప్పుడు కనక ఎవరిమీదనైనా కోపంవస్తే కంచం ఫ్లయింగ్ సాసర్‌లా పైకి లేచేది. మామీద కోపంవచ్చేది ఆయనకు. కొట్టినంతపని చేసేవాడు కానీ, కొట్టేవాడుకాదు. అది ఆయన సంస్కారం.

జీవితం పట్ల ఉపేక్షాభావం ఆయనకు లేదు. అరిషడ్వర్గాలను జయించాలంటారు. అలాంటి వ్యక్తి మీ అన్నో, తమ్ముడో అయితే భరించలేం, ప్రేమించలేం. జడపదార్థాన్ని ఎవరు భరించగలరు! జీవితం క్షణభంగురమని తత్త్వం బోధించినా బతుకులో తీపికి కారణం చావే. దేవతల్లా మనకు శాశ్వతంగా బతికేయగలిగే అవకాశముంటే మనం నిజంగా, నిండుగా బతకం, వెజిటబుల్‌లా బతుకుతాం. వాత్సల్యాలు కరువైన ఈ రోజుల్లో కూడా మా అన్నయ్య నిండుగా, స్నేహపిచ్ఛలంగా 'చిన్నా!' అని పిలువగలడు.

ప్రతి వ్యక్తి జీవితంలోనూ కనిపించని దానికోసం వెతుకులాట – అజ్ఞాతంగా అయినా ఉంటుంది. మా అన్నయ్య ఏ పనిచేసినా అందంగా చెయ్య ప్రయత్నిస్తాడు. బట్టలు వేసుకోవటం దగ్గరనుంచి చేతివ్రాత నుంచి రాయటం దాకా, భోజనం చేయటం నుంచి మాట్లాడటందాకా అందంగా, ఈస్థటిక్‌గా చెయ్య ప్రయత్నిస్తాడు. ఈ సౌందర్య దృష్టే లౌకికత్వాన్ని కనిపించని దానికి, ఆధ్యాత్మికతకు కలిపే తంతువు. 'భూతానామస్మి చేతనా' అని గీతకారుడన్న చేతన ఇదే. ఇదే ఆధ్యాత్మికం.

అలాంటి లౌకికా లౌకిక సౌందర్య పథగామి మా అన్నయ్యను నేను కట్టుకున్న ఈ చిన్ని కథల గూడు సొబగు చూడరమ్మంటూ –

సికిందరాబాద్

26.05.2003

**–కాకాని చక్రపాణి**



# మూలాల, మూల్యాల చిత్తవృత్తుల అన్వేషి

సమకాలీన కథా రచయితలు చాలామంది తమ కథల్లో వాస్తవ పాత్రల్ని చిత్రిస్తున్నారు. పాత్రల ప్రవర్తన మీద, పాత్రల మధ్య ఉండే సంఘ సంబంధాల మీదా ఎక్కువగా దృష్టి సారిస్తున్నారు. పాత్రల ప్రవర్తన, వాటి సంఘ సంబంధాల మూలాలను అన్వేషిస్తున్న రచయితలు కొంతమందే. ప్రవర్తన వెనుక ఉండే చిత్తవృత్తులు, ఆయా వ్యక్తుల ప్రత్యేకతలా? ఆనువంశిక, కౌటుంబిక, సామాజిక, సాంస్కృతిక వారసత్వం వల్ల ఆ ప్రత్యేకతలు సిద్ధించాయా? రూపుదిద్దుకున్నాయా? ఆధునిక జీవితం, ఆధునిక భావాల నేపథ్యంలో ఏఏ చిత్తవృత్తులు ప్రగతిగాముక శక్తులుగా ముందుకొస్తున్నాయి? మరి ఏవి వాటికి అడ్డంకులుగా నిలుస్తున్నాయి? ఏ మూలాలు ఏ మూల్యాలను ఎందుకు చెల్లించవలసి వస్తోంది? ఈ ప్రశ్నలకు జవాబులు అన్వేషిస్తున్న కొంతమంది కథకుల్లో చక్రపాణి ఒకరు.

కథకుడుగా చక్రపాణి ప్రత్యేకత మరొకటి ఉంది. కొన్ని కథల్లో వాస్తవ చిత్రణకు ప్రాధాన్యం ఇస్తాడు. మరికొన్నిటిలో వ్యక్తి లక్షణాల అతిశయ (కేరికేచర్) చిత్రణ ద్వారా, కంఠస్వరంలోని హాస్యవ్యంగ్య వైఖరుల ద్వారా తానుద్దేశించిన సామాజిక సాంస్కృతికాంశాల మీద ఒకొక్కసారి మూగదెబ్బలు కొడతాడు. మరికొన్ని సార్లు చావు దెబ్బలు కొడతాడు.

ఈ సంపుటిలోని కథలు ఇందుకు సాక్ష్యం.

ఈ ఇరవై కథల్లో రెండు కథా మాలికలున్నాయి. కన్యాత్వం, లేచిపోయింది, మగమహారాజు, భరణం– ఈ కథలు ఒక కథామాలిక. రాజారావు, రేఖ విద్యావంతులు, ఉద్యోగస్తులైన భార్యాభర్తలు. వాళ్ళ తల్లిదండ్రులు, రాజారావు బామ్మ, స్నేహితులు కేంద్రంగా సాగిన కథామాలిక ఇది.

రెండో కథామాలిక వరసం (వర్ధమాన రచయితల సంఘం) కథలు. అవి ఆరు. ఆంధ్రదేశంలోని కవులూ, రచయితలూ, విమర్శకులూ, నాటకాల వాళ్ళూ, రచయితల సంఘాల వాళ్లు పెట్టుకొనే పొట్టి పేర్ల మీదా, మారుపేర్ల మీదా, వాళ్ల వాగాడంబరాల మీదా, విషయపరిధిని అతిక్రమించిచేసే ఆత్మచైతన్య సృజనాత్మక విమర్శ నామక ప్రబోధాలమీదా, బిరుద ప్రదానాల మీదా, పత్రికల, పత్రికాధిపతుల ప్రచురణల తీరుతెన్నుల మీదా సాగిన హాస్య వ్యంగ్యాత్మక అతిశయ చిత్తవృత్తుల చిత్రణ ఈ ఆరు కథల కథా మాలికలో కన్పిస్తుంది. చక్రపాణి మంట ఈ కథల్లో కన్పిస్తుంది. కళా విలువల పతన చిత్రణతోపాటు కళాచర్చ పాఠకులను ఉక్కిరిబిక్కిరి చేస్తుంది.

మిగతా పది కథలు వివిధ జీవిత వాస్తవాల్ని చిత్రించినవి. ఈ పది కథలూ మొదటి కథా మాలికలోని కథల వంటివి. సమకాలీన వాస్తవ జీవితంలో సమస్యల్నీ, ఆ సమస్యల చిక్కుముడుల్లో చిక్కుకున్న వాళ్లనూ, ఆ ముడుల్ని ఛేదించుకొని బయట పడేవాళ్లనూ ఇతివృత్తంగా చేసుకున్న కథలు.

అరియర్స్, నిజాయితీ, పోలీస్ పంచాయితీ మన పాలనా యంత్రాంగంలోని నైతిక పతనాన్నీ, విలువల తారుమారునూ, రాజీల యుక్తులనూ చిత్రించినవి. అరియర్స్ కథలోని మధ్యతరగతి పరంధామయ్య, నిజాయితీ కథలోని శ్రీమన్నారాయణల మీదికంటే పోలీసు పంచాయితీలోని చేతబడి చేశారనే ఆరోపణ మీద సాంఘిక బహిష్కరణకు గురి అయిన, పోలీసుల దురన్యాయ న్యాయం తీర్పు పాలబడిన పాత్రలు మన మనసుల్ని కలచివేస్తాయి. ఆలోచింపచేస్తాయి.

పెళ్లాం మొగుడు, సమాన స్కంధులు, ఏది కారణం – కథలూ, కథామాలికలోని కన్యాత్వం, లేచిపోయింది, మగమహారాజు, భరణం కథలూ దాంపత్య సంబంధాలను చిత్రించిన కథలు. ఈ కథల్లోని స్త్రీ పాత్రలు, పురుష పాత్రలకంటే బలమైన వెన్నెముక లున్నవి. సొంత గొంతుక లేకుండా, అనుకరణ కళానైజాన్ని విప్పి చెప్పిన పెళ్లాం మొగుడులోని మంగతాయారు, సమాన స్కంధులులోని బిందు, ఏది కారణంలోని సువర్ణ, కథామాలికలోని రేఖ మహిళోద్యమ తరంలోని స్త్రీవాదంలో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రభావితమైన భావుకత్వమూ, ఆధునిక సంస్కారమూ ఉండే ఈ తరం యువతులు. తెలంగాణా సాయుధ పోరాటాన్ని బొమ్మలుగా చిత్రించిన చిత్తప్రసాద్ సంకెళ్ళు తెంచుకునే బానిసలకు ప్రతీకగా ఒక దృఢమైన వ్యక్తిని చూపడం మనం గమనించాం. చిత్తప్రసాద్ వారసత్వాన్ని కొనసాగించాలనే మోహన్ లాంటి చిత్రకారులు సంకెళ్లు తెంచుకునే పురుష స్థానంలో బలిష్ఠమైన, ఆశావహమైన భవిష్యత్తుకు సంకేతమైన ఒక స్త్రీమూర్తిని చిత్రిస్తారు. ఆ స్త్రీమూర్తి మంగతాయారు, బిందు, రేఖలను కలగలుపుకొన్న దళిత సువర్ణగా ఉంటుంది. స్త్రీ పురుష సంబంధాల రాజకీయాలనూ, కులరాజకీయాలనూ, ఆర్థికాంశాలనూ, కన్యాత్వాన్నీ, పిల్లల్ని కనే హక్కుల్నీ, సంసారహింసనూ, కులాంతర వివాహ హింసనూ, సెక్సువల్ జెలసీని, పురుషాధిపత్య సంస్కృతినీ, డబ్బుకాపీనాన్నీ – పురుషుల సకల భౌతిక మానసిక రోగలక్షణాల్నీ, హింసాయుతమైన చిత్తవృత్తుల్నీ ఎండగట్టగలిగిన స్త్రీమూర్తిగా ఉంటుంది. అయితే సమాన స్కంధులులోని బిందు భారతీయ సమాజంలోని ఘర్షణ, ఏకత, చలనం తెలిసిన మేధావంతురాలు. ఎవరి అవసరం ఎప్పుడు? ఎందుకు? అనే ఆలోచనల్ని చక్రపాణి ఈ కథల ద్వారా మనల్ని ప్రకోపింపచేస్తాడు. కథకుడి ప్రాపంచిక దృక్పథపరంగా, చక్రపాణి ఘర్షణను ఈ కథల్లో మనం చూడవచ్చు. కథకుడు సిద్ధాంతిగా ఉండలేదు. జీవితం అతని శ్వాస, ఊపిరి – జీవితం ఎంత ప్రాకృతిక, సామాజిక వాతావరణ కాలుష్యానికి గురి అయినా.



కులాంతర విశ్వాసాల మీద తెలుగు కథకులు చాలామంది ప్రశ్నలు గుప్పించి ఉండవచ్చు. గురజాడ సంస్కర్త హృదయం కథలోని వేశ్యావృత్తిలోని సరళ మొదలు కొని, చలం, కుటుంబరావుల దాకా, ఆ తర్వాత రంగనాయకమ్మ, నైమిషారణ్య రచయిత ఎన్.ఆర్.నంది, కాకాని చక్రపాణి దాకా ప్రశ్నలు తమ సృజనాత్మక రచనల ద్వారా వేసి ఉండవచ్చు. గెలుపు నంగిరి పింగిరి పురుషులది కాదు. కులాధిపత్యానిదీ కాదు. బానిసలకు బానిసలైన బానిస సమాజాన్ని ప్రశ్నించే మహిళలది. కులశ్రేణిలో హీనంగా ఉన్నారనుకునే మహిళలది.

అయితే ఈ భారతీయ సమాజానికి ప్రతినిధులుగా నిల్చేవారెవ్వరు అని సృజనాత్మక రచయిత ప్రశ్న వేసుకుంటాడు. చక్రపాణి అట్లా ప్రశ్న వేసుకున్నాడు. అతనికి ఒకవైపు చరిత్ర కన్పిస్తోంది. మరొకవైపు ఈనాటి భావసంఘర్షణ కన్పిస్తోంది. ఒక దారి వెనుకవైపు మరోదారి ముందువైపు. ఈ ఘర్షణలో చక్రపాణి – మన గత సాహిత్య వారసత్వాన్ని గుర్తించిన చక్రపాణి – సనాతనత్వంలో కొట్టుకుపోలేదు. గతంలోని మంచిని గుర్తించాడే గానీ, వర్తమానంలోని స్థితినీ, గతినీ మార్గదర్శకంగా ఎంచుకున్నాడు.

మన సమాజంలో సంస్కారవంతులైన భర్తలే లేరా? తల్లిదండ్రులే లేరా? సమ స్కంధులులోని కిరణ్ ఒక్కడే ఆ భర్త. కులాంతర వివాహం చేసుకున్నా ఏది కారణంలోని రంగస్వామిలాంటి అహంభావీ, రాయితీలనూ భార్య జీతాన్ని ఆశించే లుబ్ధుడూ కాదు. ఏది కారణం కథలోని రంగస్వామి నాయుడికి కులాంతర వివాహం ఒక వ్యాపారం. కుల చిత్తవృత్తి. కొడవటిగంటి కుటుంబరావు తన సృజనాత్మక రచనల్లో తరచుగా వాడే ఆపేక్షకు కిరణ్ ఒక గుర్తు. అయితే బిందు సాహచర్యం అతని ఆపేక్షల్ని దృఢపరిచింది. ప్రేమ, మోహాలు శరీరాన్ని కోరేవో, మనసుల్ని అపేక్షించేవో అదొక గొడవ. అపేక్ష ఇచ్చిపుచ్చుకునేది. తీసుకుంటూ ఇచ్చేది. ఈ ఆపేక్షలు బయటికి కన్పించేటంత సరళంగా ఉండవు. కానీ ఆపేక్షలు కోరే భావుకత్వమూ, మేధ, చిత్తశుద్ధీ కలిసిన పాత్రలు మన సంస్కారాన్ని విశాల పరుస్తాయి. లేచిపోయింది, మగమహారాజు కథల్లోని రేఖ తల్లిదండ్రులు సంస్కారవంతులు, రాజారావు వంటి డబ్బు పేడపురుగుకు అత్తమామలు కావడమే వాళ్ల దౌర్భాగ్యం.

నివురు చిత్తవృత్తుల పరిశీలన రీత్యా చర్చించవలసిన కథ. దాదాపు ఏడు దశాబ్దాల తెలంగాణా చరిత్రనూ, ఆ చరిత్రలోని భాగమైన ఒక సనాతన వైష్ణవ బ్రాహ్మణ కుటుంబంలోని వ్యక్తుల విభిన్న మనస్తత్వాలను, చిత్రించిన కథ నివురు. క్రియాశీలక పాత్రను ఒక దశలో పోషించిన ధర్మరాజు తల్లి అలివేలు దృష్టిలో పుట్టినప్పటి నుంచే నష్టజాతకుడు. భర్తను మింగి పుట్టినవాడు. ఈ కథలోని అలివేలుకు పుత్ర ప్రేమ

ఉందా? లేదా? ఈ వికిచిత్స పాఠకులకు కలుగుతుంది. సంక్లిష్టమైన చిత్తవృత్తి చిత్రణకు అలివేలు ఒక దృష్టాంతం. పుత్ర ప్రేమ రాహిత్యాన్ని జీవితాంతం అలివేలు అనుభవించడానికి సంప్రదాయం ఒక కారణం. ధర్మరాజు తదనంతర జీవితగమనం మరొక కారణం. భర్త జీవన విధానం, దాదాపు ఆ పద్ధతిలో కొడుకు వెళుతున్నాడనే క్షోభ ఇంకొక కారణం. నష్టజాతకుడిగా తాను జీవితాంతం భావించిన కులాంతర వివాహం చేసుకున్న కొడుకునూ, అతని భార్యనూ, వాళ్ల పిల్లలను సైతం పలకరించకూడదనే మొండితనం మరొక కారణం. ఇట్లాంటి కారణాల బందీ గుండెలో ఎక్కడో తడి.

వర్గస్వభావం వ్యక్తుల వర్గమార్పిడిలో అంటుకునే జాడ్యాలను చిత్రించిన కథ. టీకొట్టు స్థితి నుంచీ ఎదిగి ఎదిగి, మరో పెద్ద చేపకు ఎర అయిన యాదగిరి చివరకు మనోవ్యాధికి గురి అవుతాడు. పార్థసారథి ఔదార్యాన్ని ఆసరాగా తీసుకొని యాభై గజాలు కాజేసినా, ఫలితం శూన్యం. చిత్తవృత్తులను శాసించే చోదక శక్తుల్లోని ఆర్థికాంశను ఈ కథ చిత్రించింది.

వరసం కథామాలికలోని జున్ను, హన్ను, బన్ను, పొన్ను, సున్ను, విన్నీ, కన్నుల అతిశయ వ్యక్తి స్వభావణ చిత్రణల వెనుక ఉండే చిత్త సంస్కారాలను గురించి మనం ఆలోచిస్తాం.

చిత్తవృత్తుల్ని ఆడించే శక్తుల్ని చక్రపాణి ఈ కథల్లో ఒక అన్వేషకుడుగా పట్టుకోడానికి ప్రయత్నించాడు. మనిషిని మనిషిగా, ఒక సామాజిక సాంస్కృతిక మూర్త పదార్థంగా పరిశీలించాడు. మనుషులు కోల్పోతున్న ఆపేక్షలను గుర్తించాడు. పోగొట్టుకుంటున్న విలువల్ని చర్చించాడు. మనిషితనం నిలుపుకునే ఆధునిక సంస్కార శక్తుల ధైర్య సాహసాల్నీ, చొరవనూ, శీలాలనూ మన ముందుంచాడు. కథ ఒక భావుకత్వ ప్రసారశక్తి. ఒక మేధాన్వేషణ రూపం కూడా. ఈ సంపుటంలోని కథలు చదివాక, పాఠకులు వీటిని గుర్తించగలరనే నా విశ్వాసం.

హైదరాబాదు,
24 మే 2003

—కేతు విశ్వనాథరెడ్డి



# రుణానుబంధం

రచయితకు రాయక తప్పదు కనుక ఆ రీత్యా ఏర్పడ్డ రుణానుబంధాలకు కృతజ్ఞతలు చెప్పుకోవటం నా బాధ్యత.

ముందుగా చెప్పుకోవాల్సింది గోవిందరాజు చక్రధర్‌కు. నేను రచయితనని మొదటగా చెప్పింది ఆయనే. నా మొదటి రెండు కథాసంపుటాలు వెలువడ్డాయంటే అందుకు కారణం ఆయనే. క్రియాశీలత్వమూ, బౌద్ధిక చింతనాత్మక జీవనమూ – రెండూ కలగలిసిన మనిషి ఆయన. రెండు విరుద్ధ తత్త్వాలు ఓ వ్యక్తిలో ఇమిడి ఉండటం అరుదు. అలాంటి అరుదైన వ్యక్తుల్లో ఒకరు చక్రధర్. అన్నిటికంటే మిన్నగా ఆయన నాకు సన్నిహితుడు, మిత్రుడు. జీవితంలోని కష్టాలను తానే ఉంచేసుకుని సంతోషాన్ని మాత్రమే మిత్రులకు పంచే మనిషి చక్రధర్.

'ఆయన మనసంతా గుండే' అనిపించే మనిషీ, మనీషీ దుర్గెంపూడి చంద్రశేఖర రెడ్డి. నా రచనలకు మొదటి పాఠకుడూ, విమర్శకుడూ ఆయనే. ఆయన ఆధ్యాత్మికంగా ఎప్పుడూ నా వెంటే ఉంటాడు. విమర్శకుడంటే పక్కలో బల్లెం. కానీ, విచిత్రమేమిటంటే ఆయన విమర్శ మహా మృదువుగా ఉంటుంది. కుట్మలం శరీరంలోకి దిగినా నెప్పనిపించదు.

ఇంక కేతు విశ్వనాథరెడ్డిగారు పరిచయమైంది మొదలు అంత ఆత్మీయంగా, స్నేహ పిచ్చలంగా మాట్లాడి, వ్యవహరించగల వ్యక్తి నాకు జీవితంలో తారసపడలేదు. మహావిద్వత్తుకు తోడు దిటవైన గుండెకూడా ఉన్న మనిషి. విమర్శకుడేకాదు సృజనాత్మక రచయిత. ఈ నా మూడో కథా సంపుటం 'నివురు'కోసం ముందుమాట రాయమని అడగ్గానే, కాదనక 'చిత్తవృత్తుల మూలాల, మూల్యాల అన్వేషి' రాసిచ్చారు.

వీరందరికీ నా కృతజ్ఞతలు.

కథల్ని పత్రికలకు పంపిస్తాం. నచ్చితే వేస్తారు, లేకపోతే తిప్పి పంపుతారు. ఒకప్పుడు పత్రికా సంపాదకులతో నాకు పరిచయముండేది కాదు. ఇప్పుడు వారంతా తెల్సినా పరిస్థితిలో మాత్రం మార్పేం ఉండదు. తెలుసు కనుక వారికి పేరు పేరునా ధన్యవాదాలు తెల్పటం నా విధి. 'ఆంధ్రభూమి' దినపత్రిక సంపాదకులు ఎం.వి.ఆర్.శాస్త్రి గారికి (పెళ్ళాంమొగుడు, సమాన స్కంధులు), అప్పటి 'ఆంధ్రప్రభ' సచిత్ర వారపత్రిక సంపాదకులు వల్లూరు రాఘవరావు గారికీ (అరియర్స్, పోలీసు పంచాయితీ), 'ఆంధ్రభూమి' సచిత్రవారపత్రిక సంపాదకులు ఎ.ఎస్.లక్ష్మి గారికీ (నిజాయితీ, ఏది కారణం?, కన్యాత్వం, లేచిపోయింది, మగమహారాజు, భరణం), 'విపుల' ఒకప్పటి సంపాదకులు కీ. శే. చలసాని ప్రసాదరావు గారికీ (నివురు), 'ఇండియా టుడే' సంపాదకులు, రాజశుకగారికీ (వర్గ స్వభావము), 'ఈనాడు' సండే మాగజైను సంపాదకులు పి.డి.పి.వర్మ గారికీ (వాజెమ్మ), 'ప్రజాశక్తి' ఆదివారం అనుబంధం సంపాదకులు గుడిపూడి విజయరావుగారికీ (వివశులు), మా కాలేజీ సాహిత్య వార్షిక సంచిక 'నెలవంక' సంపాదకులు – డా. నాయని కోటేశ్వరి, మోతుకూరి నరహరి గార్లకు (వరసం) నా కృతజ్ఞతలు.

ఈ కథా సంకలనానికి ముఖపత్ర రచన చేసిన సుప్రసిద్ధ చిత్రకారులు మోహన్ గారికి నా ధన్యవాదాలు.

అక్షరాల్ని అందంగా డిటిపిలో కూర్చిన రఘురామయ్య గారికీ, పుస్తకాన్ని చక్కగా అచ్చొత్తిన ఆకృతీ ఆర్ట్‌ప్రింటర్స్ కిరణ్‌గారికీ నా కృతజ్ఞతలు.

సికింద్రాబాద్,
26.05.2003

—కాకాని చక్రపాణి

# ఇదీ కథా క్రమం


Z **పెళ్ళాం మొగుడు ........................................ 11**

Z **అరియర్స్ ........................................ 19**

Z **సమాన స్కంధులు ........................................ 31**

Z **నిజాయితీ ........................................ 39**

Z **నివురు ........................................ 48**

Z **వర్గ స్వభావం ........................................ 66**

Z **ఏది కారణం? ........................................ 76**

Z **కన్యాత్వం ........................................ 85**

Z **లేచిపోయింది ........................................ 94**

Z **మగమహారాజు ........................................ 102**

Z **భరణం ........................................ 111**

Z **వాజెమ్మ........................................ 120**

Z **వివశులు ........................................ 129**

Z **పోలీసు పంచాయితీ ........................................ 138**

Z **వరసం ........................................ 154**




# పెళ్ళాం మొగుడు

**"ఓం** మారీచాయ నమః, ఓం దుష్ట రామబాణ నిధనాయనమః, ఓం తాటకీ పుత్రాయ నమః, ఓం సుబాహు భ్రాతాయ నమః, ఓం రామాయణ కథానాయకాయ నమః.." అంటూ అష్టోత్తరం చదివి కొబ్బరికాయ కొట్టాడు మారయ్య. ఆపైన చెంపలు ఫెటఫెటా వాయించు కుని, సాష్టాంగ దండప్రణామం చేశాడు మారీచ మహాసుర చిత్ర ప్రతిమకు మహాభక్తిగా. ఆ తర్వాత ఓ పిల్లి కూత కూశాడు, కుక్కలా భౌభౌ మన్నాడు, గార్దభంలా ఓండ్రపెట్టాడు.

అంతలో కాని కాలంలో ఓ కోయిల "కుహూ, కుహూ" అని కూసింది. మారయ్య వెనక్కి తిరిగి "రా, రా" అంటూ పిల్చాడు. ఆ వచ్చింది ఇల్లుగలాయన కూతురు మంగ తాయారు. కోయిల గొంతును అనుకరిస్తూ, మిమిక్రీ కళాకారుడైన మారయ్య గుండెల్లో గూడు కట్టుకుందా పిల్ల.

ఆమె దృష్టి ఎప్పటి నుండో మారయ్యపై వాలింది. ఆమె తండ్రి కుక్కుటేశ్వరరావుకు ఏడుగురు కూతుళ్ళు. ఐదుగురికి కట్నాలిచ్చి పెళ్ళిళ్ళు చేసి చతికిలబడి పోయాడాయన. తనకు పెళ్ళి చేసే పరిస్థితిలో తండ్రి లేడని ఆమెకు తెల్సు. అందుకే మారయ్యను ఎంచు కుందామె. మారయ్య చక్కటి గవర్నమెంటు ఉద్యోగం చేస్తున్నాడు. ఒక్క మిమిక్రీ విషయంలో తప్ప మారయ్యలో మూర్ఖత్వం మచ్చుకైనా కన్పించదు. మిమిక్రీ అతనికో అబ్సెషనై పోయింది. అదీ అతని గురువు గురువయ్య అంటించిన జాడ్యం. అతన్ని ఆక ర్షించి తన దోవకు తెచ్చుకుంటే అతని గురువుకు విడాకులిప్పించటం చిటికెలో పని. మనిషి బలహీనత నాధారంగా మనిషిని సాధించటం తేలిక అని ఆమె ఎప్పుడో తెల్సు కుంది. అందుకే కోయిలగొంతు ననుకరించింది ఆమె. మిగతా వాటిని అనుకరించటం ఆమె వల్లకాని పని. కోయిలగొంతు ఆమె రాకకో సంకేతమైంది. ఆ స్వరం వినంగానే మారయ్య గుండె కోతిలా కుప్పిగంతులేస్తుంది.

"మారూగారూ! సాయంత్రం సినిమా ప్రోగ్రాం మర్చిపోలేదుగా మీరు?" అని అడిగింది.

"నేనా మర్చిపోయేది? కులగిరులు కుంగనీ, సప్తసముద్రాలు ఇంకిపోనీగాక, ఈ మారయ్య మాత్రం ఇచ్చిన మాట తప్పడుగాక తప్పడు" అన్నాడు మారయ్య పౌరాణికాల్లోని పాత్రననుకరిస్తూ.

"అబ్బ! ఎంత చక్కగా మాట్లాడతారు! మీతో మాట్లాడుతుంటే ఇంక పౌరాణిక నాటకాలు చూడాలనిపించదు" అందామె ప్రశంసా పూర్వకంగా, అతని వంక చూస్తూ.

'మరేంటనుకున్నావ్. మన ప్రతిభ అంటే' అన్నట్లు గర్వంగా ఆమె వంక చూశాడు మారయ్య.

"సరే వస్తా. సాయంత్రం మర్చిపోకండి" అంటూ ఆమె వెళ్ళిపోయింది.

మారయ్య అనుష్ఠానం పూర్తికాలేదు. రకరకాల జంతువుల అరుపులతోపాటు, రైలింజను, విమానం లాంటి యంత్రాలను అనుకరిస్తూ ప్రాక్టీసు చేస్తున్న తరుణంలో, చేతిలో ఫ్లాస్కుతో గదిలో కడుగుపెట్టాడు మారయ్య మిత్రుడు వినాయకరావు.

"ఒరేయ్, మారయ్యా, ఇలా ప్రాణం తోడకురా రోజూ. ఈ పిల్లి కూతలూ, కుక్కలు, గాడిదల అరుపులు వినలేక ఛస్తున్నాను" అన్నాడు వినాయకరావు కాఫీ ఫ్లాస్కు టేబుల్ మీదపెడ్తూ.

"పోతే పోనీ ప్రాణం. ఇలా రోజూ పుటుక్కు పుటుక్కుమని చావటం కంటే ఒకే రోజు పోతేపోలా. వెధవ ప్రాణం, వెధవ ప్రాణమని. నా కళా వ్యాసంగానికి అడ్డొచ్చావంటే నిజంగానే నీ ప్రాణం తీస్తాను" అన్నాడు మారయ్య.

వీధి వైపు తలుపు నుండి లోపలికి తొంగి చూసింది ఓ గాడిద. ప్రహరీ లోపలనున్న తలుపు నుండి లోపలకు ప్రవేశించాడు కుక్కుటేశ్వరరావు.

"ఏమయ్యా రోజూ ఈ ఆగడం. కుక్కల్నీ, గాడిదల్నీ, పిల్లుల్నీ పెంచుతున్నారా? మీకు గది అద్దెకిచ్చే రోజే చెప్పాను. ఇలా అడ్డమైన జంతువుల్నీ పెంచే వాళ్ళంటే నాకిష్టం లేదని. ఏమిటయ్యా అది? ఆ గాడిద మీదేనా?" అన్నాడు కుక్కుటేశ్వరరావు కోపంగా లోపలకు తొంగి చూస్తున్న గాడిదను పరికిస్తూ.

"ఛఛ. మాదెందుకవుతుందండీ. ముద్దుగా కుక్కల్నీ, పిల్లుల్నీ అయితే పెంచుకోవచ్చు గాని గాడిదల్ని పెంచుతారా ఎవరైనా?" అన్నాడు వినాయకం.

"ఒరే, అలా అనకురా. అపచారం మాటలు. గాడిదల్ని పెంచుకుంటే మాత్రమేం తప్పు? ఎంత ముద్దుగా ఉంటాయవి! గణపతి లాంటి మహానుభావుడు గార్దభ రాజాన్ని విష్ణువుతో పోల్చాడు" అని గార్దభం వంక తిరిగి, "రావే నా వరహాల కూనా, నా బంగారుగనీ, నా వజ్రాల మూటా" అంటూ గార్దభంలా ఓండ్రపెట్టసాగాడు మారయ్య.

దాంతో గాడిద లోపలకు ప్రవేశించింది.

"ఓరి గాడిదా! అయితే రోజూ నువ్వే కూస్తున్నావన్న మాట ఈ కూతలన్నీ" అన్నాడు కుక్కుటేశ్వరరావు.

ఆయన మాటలు పట్టించుకోలేదు మారయ్య. "రావే కన్నిముండా, బుజ్జిముండా, రా కూర్చో" అని లోపలకు ఆహ్వానించి కుర్చీ చూపించాడు.

అది అతనివంక సందేహంగా ఓసారి చూసి తోకాడించింది.

"ఎందుకు సిగ్గుపడుతున్నావ్? ఇక్కడ పరాయి వాళ్ళెవరూ లేరు. అంతా మనవాళ్ళే" అని సిగ్గుపడుతున్న గాడిదను పట్టుకుని కుర్చీలో కూర్చుండబెట్టబోయాడు మారయ్య. పాపం, అతని మర్యాదని ఏ రకంగా అర్థం చేసుకుందో కానీ, వెనక్కాళ్ళతో అతన్నొక్క తన్ను తన్ని వీధిలోకి సగర్వంగా నడుచుకుంటూ వెళ్ళిపోయింది గార్దభరాజం.

మారయ్య, "కుయ్యో మొర్రో" అన్నాడు.



"మా బాగా అయింది. వెధవ! కుంక! గాడిదలకు మర్యాద చేస్తావా? అంతా మన వాళ్ళే, పరాయి వాళ్ళెవరూ లేరంటావా దాంతో. మమ్మల్ని గాడిదలతో సమానం చేస్తావా? మా బాగా అయింది శాస్తి" అన్నాడు సంతోషపడ్తూ కుక్కుటేశ్వరరావు.

"గార్దభాలకంటే మీ గొప్పేంటండీ? గాడిదలు బరువులు మోస్తాయి. మీరు గాడిదలా బోల్డంత సంసార భారాన్ని మోస్తున్నారు."

"గాడిద వెధవా! నన్నా వీధి గాడిదలతో పోల్చావంటే పళ్ళు రాలగొడ్తాను."

"పోన్లేండి ఇంటి గాడిదే అంటాను."

"అదుగో మళ్ళీ..."

కోపం వచ్చింది మారయ్యకు. "ఇదుగో ముందే చెప్తున్నాను. గుర్తుంచుకోండి. నన్నేమన్నా పట్టించుకోనుగాని, ఆ గార్దభ రాజాన్ని తిడ్తే మాత్రం ఊర్కోను. గాడిదకాళ్ళు పట్టుకునే రోజు మీకూ వస్తుంది. వసుదేవుడంతటి వాడు గాడిద కాళ్ళు పట్టుకున్నాడు. బోడి, మీ గొప్పేంటి?" అన్నాడు.

"నా గొప్పేంటో ఇల్లు ఖాళీ చేయిస్తే గానీ నీ కర్థంకాదు. ఈ పిల్లికూతలూ, కుక్కకూతలతో నా తల బొప్పి కట్టిపోతోంది. మీరు తక్షణం ఇల్లు ఖాళీ చేసేయండి" అన్నాడు కుక్కుటేశ్వరరావు రోజుకుంటూ, రొప్పుకుంటూ.

తండ్రి మారయ్య గదిలో కొచ్చినప్పటి నుండి మంగతాయారు గది బయట నిలబడి జరిగేదంతా చూస్తూనే ఉంది. తన దారికి వస్తున్న తరుణంలో మారయ్యను, వినాయకాన్ని గది ఖాళీ చేయించేస్తే మారయ్య కట్టుతప్పిపోతాడు. తన పథకం పారదు. అందుకే, లోపలికొచ్చి, "ఇంత చిన్న విషయానికి అంత పెద్ద శిక్షా నాన్నా? పిల్లిమీద బ్రహ్మాస్త్రమా? నీలాంటి పెద్ద హృదయం ఉన్న మనిషి అలా అనకూడదు" అంది తండ్రితో.

మారయ్యను 'పిల్లి' అన్నందుకూ, తనది 'పెద్ద గుండె' అన్నందుకూ కుక్కుటేశ్వరరావు చెరువులాంటి హృదయం పొంగిపోయింది.

"సరేనమ్మా, నువ్వు వద్దంటే నేను కాదనవులే. కాని ఇతని వ్యవహారం శృతిమించి రాగాన పడ్తున్నది" అన్నాడు కుక్కుటేశ్వరావు.

ఆయన అలా అనటంతో వినాయకరావు ఊపిరి పీల్చుకున్నాడు.

"ఛఛ, పెద్దలు మీరలా అనకూడదు. ముందు మీరలా కుర్చీలో కూర్చోండి. ఈ ప్రసాదం స్వీకరించండి" అంటూ వినాయకరావు మారయ్య మారీచ మహాసురుడికి కొట్టిన కొబ్బరిచిప్ప నుండి కొబ్బరి ముక్కలు తీసి తండ్రీ కూతుళ్ళిద్దరికీ ఇచ్చాడు.

అవి తింటూ, "ఆహా... మీకూ దైవభక్తి తగలడిందన్న మాట" అన్నాడాయన కుర్చీలో కూర్చుంటూ.

"అమ్మో, మామూలు భక్తా, వీరభక్తి కదండీ మా వాడిది. ప్రతి మంగళవారం మారీచ మహాసురుడికి పూజచేసి, కొబ్బరికాయ కొట్టందే మా వాడు పచ్చి మంచినీళ్ళయినా పుచ్చుకోడంటే నమ్మండి" అన్నాడు వినాయకరావు.

"అదేంటయ్యోయ్, మారీచ మహాసురుడెవరూ?"

"ఆ విగ్రహం చూడు నాన్నా! వాళ్ళ గురువుగారు తయారుచేసి ఆయన కిచ్చారంట. రామాయణంలో బంగారు లేడి అయి సీతా మహాసాధ్విని ఆకర్షించాడే ఆ మహానుభావుడే వారి ఆరాధ్య దైవం" అని వివరించింది మంగతాయారు.

మారయ్య ప్రశంసగా ఆమె వైపు చూస్తూ తన్మయంలో పడిపోయాడు.

"ఓరి, నీ యమ్మ కడుపుడకా, రాక్షసుల నటయ్యా ఆరాధించటం?" అన్నాడు కుక్కుటేశ్వరరావు ఆశ్చర్యపోతూ.

తన్నేమన్నా భరించగలడు గానీ, తన గురువును గానీ, తన ఇష్టదైవాన్ని గానీ ఎవరేమైనా అంటే సహించలేడు మారయ్య.

"అదుగో, అలాంటి అపవిత్రపు కూతలే కూయొద్దంటాను. రాముడి కంటే మారీచుడేం తక్కువ. మిమిక్రీ కళను ఈ భూప్రపంచంలోకి మొట్టమొదటిసారిగా ప్రవేశపెట్టింది ఆ మహానుభావుడే" అంటూ భక్తిభావంతో ఊగిపోతూ, "మారీచ మహాప్రభువు, 'హాలో, లక్ష్మణా' అంటూ రాముడి గొంతును అనుకరిస్తూ అరిచేటప్పటికి మహాపతివ్రత అయిన సీతామహాసాధ్వి కూడా అది భర్త గొంతుకాదని గుర్తు పట్టలేకపోయింది కదా! అంత చక్కగా ఇతర్ల గొంతును అనుకరించిన మారీచ మహాసుర ప్రభువే మిమిక్రీ కళాకారులందరికీ పరదైవం, ఆ కళకు పితామహుడు" అని భక్తి తాత్పర్యాలతో ఉపన్యసించాడు మారయ్య.

"నృత్యకళని అభ్యసించే వాళ్ళు నటరాజు విగ్రహాన్ని ముందుంచుకుని నాట్యం అభ్యసించినట్లే మా వాడూ ఈ మారీచ మహాప్రభువు విగ్రహం ముందుంచుకుని తన మిమిక్రీ కళ సభ్యసిస్తుంటాడు. అక్కడికీ తెల్లవారు ఝామునే తన ప్రాక్టీసు ప్రారంభిస్తానంటాడు కానీ 'తెల్లారింతర్వాత మొదలెట్టరా, లేకపోతే చుట్టుపక్కల వాళ్ళు పీడకలలొచ్చి బాధ పడ్తారు' అని నేను నచ్చజెప్పబట్టి, మా వాడు దయార్ద్ర హృదయంతో – వాడు ఇతరులు బాధపడ్తుంటే చూడలేడు లెండి – తెల్లారింతర్వాతే ప్రాక్టీసు చేస్తున్నాడు" అన్నాడు వినాయక రావు మారయ్య పిల్లి కూతలకూ, కుక్క కూతలకూ, రైలింజన్, ఏరోప్లేన్ లాంటి యంత్రాల అనుకరణకూ వివరణ ఇచ్చుకుంటూ.

"ఏవి కల్పనరా, నాయనా! అద్భుతం! మీలాంటి పాపిష్ఠి ఆలోచనలున్న వాళ్ళని ఇదే మొదటిసారి చూడటం. నా జన్మ తరించింది" అన్నాడు కుక్కుటేశ్వరరావు.

"అదిగో మళ్ళా! మావి పాపిష్ఠి ఆలోచనలా? మళ్ళీ అలాంటి మాటలంటే ఊర్కునేది లేదు కుక్కేశ్వర్రావుగారూ! మీరెంత ఇంటి ఓనరైనా నాకు లెక్కలేదు" అన్నాడు మారయ్య.

"ఊర్కోకపోతే ఉరెట్టుకో. నా ఇంట్లో ఈ అరాచకం కుదరదు."

"ఉరిపెట్టుకోవాలా? అంత మాట నన్నేనా అంది కుక్కేశ్వర్రావుగారూ?"

"ఇదిగో, ఏమయ్యోయ్. ఇందాకటి నుండి చూస్తున్నాను 'కుక్కేశ్వర్రావు కుక్కేశ్వర్రావు' అంటున్నావు. నా పేరు కుక్కుటేశ్వరరావు, కుక్కేశ్వర్రావు కాదు. మళ్ళీ కుక్కేశ్వర్రావు అన్నావా చమడా లెక్కదీస్తాను."

"పేర్లో ఏముందండీ. కుక్కుటమంటే కుక్క కాదా ఏమిటి? ఆ సంస్కృతం కంటే మన తెలుగే బావుంది. తెలుగు మీది అభిమానంతోనయినా కుక్కేశ్వర్రావు అని పేరు మార్చుకోండి" అన్నాడు మారయ్య. కుక్కుటమంటే కోడి కదా అనకండి. అతను చెప్పాక కోడి కూడా కుక్కే అవుతుంది.

కాని, కుక్కుటేశ్వరరావు తెలుగు భాష మీద అభిమానం, ప్రేమలేని మనిషి.

"టాట్ వీల్లేదు... నువ్వెవడివయ్యా నా పేరు మార్చటానికి? కుక్కుటేశ్వరస్వామి మీది భక్తితో మా అమ్మా నాయన పెట్టిన పేరు. ఇప్పుడు బొడ్డూడని కుంకవి నువ్వు చెప్పావు కాబట్టి నేను మార్చుకోవాలా? నా పేరు ఇహనుంచీ పొరపాటున కూడా తప్పుగా పిల్చావా నీ డొక్క చీరేస్తాను" అన్నాడాయన.

"అలాగే కుక్కేశ్వర్రావుగారూ..." అంటూ నాలిక్కరుచుకున్నాడు మారయ్య.

"మళ్ళీ...ఇదిగో, లే...లే, కుర్చీలో నుండి" అని పెద్దగా అరిచాడు కుక్కుటేశ్వర్రావు.

'పాపం, పిచ్చి పట్టినట్లుంది. రేబిస్ ఏమో' అనుకుంటూ బిక్కచచ్చిపోయి లేచి నించున్నాడు మారయ్య.

"చెవులు పట్టుకో రెండు చేతుల్తో."

పట్టుకున్నాడు మారయ్య.

"ఏంటి నా పేరు చెప్పు... కుక్కుటేశ్వరరావు అను."

"కుక్కుటేశ్వరరావు" చెప్పాడు మారయ్య.

"ఊఁ, కూచో... ఇప్పుడు చెప్పు, ఏంటి నా పేరు?"

"కుక్కుటేశ్వరరావు"

"మళ్ళీ లే... ఆఁ, చెప్పు ఏంటి నా పేరు?"

"కుక్కుటేశ్వరరావు."

ఇలా గుంజీలు తీయించి, తండ్రి తన పేరు మారయ్య చేత బట్టీ పట్టిస్తుంటే మంగతాయారు మైనపు హృదయం కరిగిపోయింది.

"తప్పు నాన్నా, తప్పు! మహాకళాకారుడినలా అవమానించకూడదు మనం" అంది.

గుండె మోకాల్లోకి జారిపోయిన మారయ్య కృతజ్ఞతగా ఆమె వంక చూశాడు.

"ఏంటే తప్పు! ఈ కుక్క కూతల మారయ్య మహాకళాకారుడా?"

"ఆయన సంగతి నీకు తెలీదు నాన్నా! మారూగారూ, ఓసారి యన్టీఆర్‌లా ఓ డైలాగు విసరండి" అంది మంగతాయారు, తండ్రికి మారయ్య ప్రతిభ కనపర్చాలనే ఆరాటంతో.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=600**